క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం ప్రారంభం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం-1 నూతన భవనాన్ని ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం ప్రారంభించారు. అనంతరం పశువుల ఆస్పత్రి వద్ద పశువుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన నీటితొట్టి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే సంతతోట వద్ద ఉన్న కోనేరు ఆధునీకరణ పనులకు భూమిపూజ చేశారు. అయితే ఆయా కార్యక్రమాలు ఉన్నట్లు సోమవారం ఉదయం 7 గంటల వరకు సంబంధిత అధికారులెవరికీ సమాచారం లేకపోవడం చర్చనీయాంశమైంది.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో సత్యసాయి మందిరం వద్ద సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం వారి శంకర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన ఈ శిబిరానికి కంటి పరీక్షల నిమిత్తం మొత్తం 51 మంది హాజరు కాగా వారిలో 30 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వారందరికీ ఉచితంగానే ఆపరేషన్లు చేయనున్నట్లు ఆప్తాలమిక్ అధికారి జాక్సన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం లక్ష్మి, క్యాంపు కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ తప్పని సరిగా పాటించాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సోమవారం సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుతో పాటు విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందివ్వాల్సిన బాధ్యత మనదన్న భావన అందరిలో కలగాలన్నారు.

సర్వేలపై సమీక్ష

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గ్రామాల్లో చేపట్టిన సర్వేలపై ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన ఇంటి పన్ను వసూళ్లు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సౌకర్యం తదితర సర్వేల్లో పురోగతి, పెండింగ్ అంశాలపై వివరాలను ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసి జూదరులను పట్టుకున్నామన్నారు. వారి దగ్గర నుంచి రూ.6420 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేశామన్నారు.

'ఉపాధి' సిబ్బందితో ఎంపీడీవో సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం సమావేశమయ్యారు. ఏపీవో సహా టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కొత్తగా వచ్చి విధుల్లో చేరినందున వారు చేపట్టాల్సిన విధులను వారికి క్షుణ్ణంగా వివరించారు.

హామీలు అమలు చేయాలి

బొబ్బిలి: ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సమయంలో కూటమి నాయకులు వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఆ హామీ నెరవేర్చే దిశగా ఒక్క ప్రకటన కూడా చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు.

సజావుగా ఎస్ఏ-2 పరీక్షలు

తెర్లాం: మండలంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రారంభమైన ఎస్ఏ-2(సమ్మేటివ్-2/వార్షిక పరీక్షలు)సజావుగా జరుగుతున్నాయి. ఎంఈవోలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు పలు పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

వనరులు ఫుల్.. ఆదాయం నిల్!

- తిరోగమనంలో మున్సిపల్ ఆదాయం
- ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్న మున్సిపల్ అద్దె షాపులు
- అద్దెల ద్వారా వచ్చే ఆదాయం తగ్గడంతో కానరాని ప్రగతి
- అనాలోచిత నిర్ణయాలతోనే దుస్థితి



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఖాళీగా కనిపిస్తున్న మున్సిపల్ కార్యాలయ అద్దె షాపులు

రాజాం:

స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆదాయం తిరోగమనం బాట పట్టింది. అనాలోచిత నిర్ణయాల కారణంగా మున్సిపల్‌కు రావాల్సిన ఆదాయం రోజురోజుకూ తగ్గుతోంది. నిర్వహణ భారం అధికమవుతున్న వేళ దానికి తగ్గట్టుగా రావాల్సిన ఆదాయం మాత్రం కుంటుపడుతోంది. గత ఏడెనిమిది నెలలుగా మున్సిపల్ కార్యాలయ ఆదాయ వనరులు నిష్ఫలంగా మారాయి. ప్రస్తుతం మున్సిపాలిటీకి చెందిన అద్దె షాపులు ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడింది. గతంలో వచ్చే ఆదాయం కన్నా ఇప్పుడు మున్సిపల్‌కు వచ్చే ఆదాయం బాగా తగ్గడంతో అభివృద్ధి పనులు కూడా అంతగా కానరావడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



మాధవ బజారులో వ్యాపారులు ఖాళీ చేసిన దుకాణాలు

ఈ నిర్ణయాలే.. కొంపముంచాయి..

కొన్ని అనాలోచిత నిర్ణయాలే మున్సిపల్ ఆదాయం కొంప ముంచాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మున్సిపల్ కార్యాలయ అద్దె షాపుల్లో మౌలిక సదుపాయాలు కొరవడడం, ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న విశాలమైన స్థలాన్ని ఆటోస్టాండ్, మార్నింగ్ మార్కెట్‌గా మార్చడం వంటి నిర్ణయాలు మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేలా చేశాయి. ఆయా చోట్ల చెత్తాచెదారం పెద్దఎత్తున పేరుకుపోయి దుర్వాసన కూడా వెదజల్లుతుండడంతో అక్కడికి ఎవరూ రావడం లేదు. దీంతో షాపుల్లో కొనుగోలు శాతం తగ్గింది. దీంతో పాటు మాధవ బజార్‌లోని విలువైన షాపులను బాగుచేయకపోవడం, అక్కడి షాపుల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడం ఫలితంగా వ్యాపారులు షాపులను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గతంలో రూ.4 లక్షలకు పైగా..

రాజాం మున్సిపల్ కార్యాలయ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ కూడలి, మాధవబజారు తదితర ప్రాంతాల్లోని 76కు పైగా అద్దె షాపులు ఉన్నాయి. అప్పట్లో ఒక్కో షాపు నుంచి కనీస అద్దె రూ.2 వేల నుంచి గరిష్ఠంగా రూ.6 వేలు వరకు నెలకు అందేది. ఈ లెక్కన నెలకు మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన అద్దె షాపుల ద్వారా రూ.4 లక్షలకు పైగా ఆదాయం వచ్చేదన్న మాట. ఇప్పుడు ఈ ఆదాయానికి గండి పడింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు మాధవబజారులోని అద్దె షాపులన్నీ మెల్లమెల్లగా ఖాళీ అవుతున్నాయి. 76 దుకాణాలకు గాను 41 దుకాణాల నుంచి మాత్రమే అద్దెలు లభిస్తున్నాయి. మిగిలిన షాపులను వ్యాపారులు ఖాళీ చేశారు.

ఇప్పుడు రూ.1.50 లక్షలు.. గగనం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాత అద్దెకు 30 శాతం వరకు అద్దె పెంచడంతో కొంతమంది షాపులను వదులుకున్నారు. కొంతమందికి అద్దె బకాయిలు, వడ్డీలు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంతో వారు కూడా భయపడి షాపులను ఖాళీ చేశారు. ఫలితంగా నెలకు రూ.4 లక్షలకు పైగా ఆదాయం రావాల్సిన చోట ఇప్పుడు నెలకు రూ.1.50 లక్షల ఆదాయం రావడం గగనంలా మారింది. ఎంతో విలువైన అద్దె షాపులు ఉన్నప్పటికీ ఆదాయం రాకపోవడంతో మున్సిపల్ కార్యాలయ నిర్వహణ ఇబ్బందిగా మారింది. షాపుల ద్వారా ఆదాయం తీసుకురావడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు.

అద్దె కట్టుకోలేకనే ఖాళీ చేశాం..

మాకు గతంలో పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద మున్సిపల్ కార్యాలయం నుంచి ఓ షాపును అద్దెకు తీసుకున్నాం. నెలకు రూ.5 వేలు అద్దె చెల్లించే వాళ్లం. మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా అక్కడ లేకపోవడంతో వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయి. దీంతో అద్దెలు చెల్లించ లేక షాపు ఖాళీ చేశాం.

-కంది వెంకటరమణ, వ్యాపారి, రాజాం

అద్దెలు పెంచేశారు..

మాధవబజారులోని దుకాణాలకు ఎక్కువ అద్దె చెల్లించాల్సి వస్తోంది. అక్కడ కూడా లోపలకు షాపులు ఉన్నాయి. అక్కడి పరిసరాలు అధానంగా ఉండడంతో దుర్వాసన వస్తోంది. ఆ వాసనకు భయపడి ఎవరూ రావడం లేదు. అద్దె కూడా పెంచేశారు. అద్దె భారంతోనే వ్యాపారాలు చేయలేకపోతున్నాం.

-ఎం.రామారావు, వ్యాపారి, రాజాం

వినియోగంలోకి తీసుకువస్తాం..

మున్సిపల్ అద్దె షాపులను వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టిసారించాం. మౌలిక వసతులు లేని చోట వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. అద్దె నిర్ణయాలు మాత్రం ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉంటాయి. ప్రస్తుతం ఎన్ని షాపులు ఖాళీగా ఉన్నాయన్న విషయం తమ దృష్టిలో లేదు.

-కె.శ్రీనివాసరావు, మేనేజర్, మున్సిపల్ కార్యాలయం, రాజాం

కనీస వేతనం రూ.26 వేలు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

బాడంగి: వీఆర్‌ఏలకు ప్రస్తుతం ఇస్తున్న కనీస వేతనం రూ.10,500లను రూ.26 వేలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన వీఆర్‌వోలతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు సుధాకర్‌కు వీఆర్‌వోలు అందజేశారు. రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగులుగా ఉన్న తమకు వేతనాలు పెంచాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాజాం: పట్టణంలోని మాధవబజార్, వాసవీ నగర్, గాయత్రీకాలనీ, సారథి ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటి వద్దకు రాగానే తడి, పొడి చెత్తను వేరు చేసి ఉన్న డబ్బాలను వారికి అందించాలని ప్రజలను కోరారు. అలాగే కూరగాయ వ్యర్థాలతో హోమ్ కంపోస్ట్ తయారు చేసుకోవాలన్నారు.

'ఆరోగ్యశ్రీ' ఆగిందంటే.. అది ప్రభుత్వం చేతకానితనమే..

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయంటే అది ప్రభుత్వ చేతకానితనమేనని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ పథకం కొత్త పేరు)లకు సంబంధించి మొత్తం రూ.3,500 కోట్లు బకాయి ఉందని, వాటిని చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యజమానులంతా నెల రోజుల ముందు నుంచే నోటీసులు ఇస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యమంటే చంద్రబాబు ప్రభుత్వానికి ఎంత చులకనో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు వైద్యసేవలు అందించడంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనకంజ వేయలేదని గుర్తు చేశారు. కోవిడ్ బారినపడిన వారిని కూడా ఆరోగ్యశ్రీలో చేర్చి, వారికి పూర్తిగా నయమయ్యేంత వరకు ఉచిత వైద్యం అందించారన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 45 లక్షల మందికి రూ.13 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరిందని, ఆరోగ్య ఆసరా ద్వారా 25 లక్షల మందికి మరో రూ.1465 కోట్లు పైగా ఆర్థికసాయం అందిందని తెలిపారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం మాత్రం పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చే ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని విమర్శించారు. తక్షణమే ఆరోగ్యశ్రీ బకాయి డబ్బులు విడుదల చేసి, ఆ సేవలను కొనసాగించాలని కోరారు.

బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేగిడి: బీసీలపై అగ్రవర్ణాల దాడులు అధికమవుతున్నాయని, తక్షణమే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం.. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నా ఇంతవరకు బీసీలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం, అభివృద్ధికి రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తామని, బీసీల రక్షణకై న్యాయ పరిశీలన కమిటీ వేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలు నిలబెట్టుకునే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ కె.తేజోవెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో ఈ నెల 6వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ కె.అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆ దుర్ఘటనలో మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేటకు చెందిన పదేళ్ల బాలుడు బసవ రితీష్‌నారాయణకు గాయాలు కాగా, రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న తమ కొడుకుని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆ వాహనాన్ని గుర్తించి, డ్రైవర్‌ను పట్టుకున్నామన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొబ్బిలి రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన .. ఫ్లాష్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో పాడైన బోర్లు బాగు చేయించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. అలాగే జల్ జీవన్ మిషన్ కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందేలా చూడాలని, సచివాలయాల వద్ద ప్రజల తాగునీటి సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



రాజాం సిటీ: ర్యాలీలో పొగిరి పీహెచ్‌సీ సిబ్బంది

రాజాం సిటీ/బొబ్బిలి రూరల్: రాజాం మండలంలోని పొగిరి, బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామాల్లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయా గ్రామాల పీహెచ్‌సీల వైద్యాధికారులు జి.భార్గవి, రఘువంశీలు.. మెరుగైన ఆరోగ్యానికి పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు, ఖనిజలవణాలు, నీరు, పీచు వంటి పౌష్టికాహార పదార్థాలని, రోజువారీ ఆహారంలో ఇవి ఉండేలా చూసుకోవాలన్నారు.

● ఆదుకోండి 'బాబూ'

ఈ చిత్రంలో తన దీనస్థితిని వివరిస్తున్న మహిళ పేరు సొంటీన గంగమ్మ. రామభద్రపురం మండలం జన్నివలస పంచాయతీ పరిధిలోని నేరళ్లవలస గిరిజన గ్రామం. ఈమెకు 20 ఏళ్ల వయసు. తల్లిదండ్రులు లేని అనాథ. ప్రభుత్వమిచ్చే రేషన్, పెన్షనే జీవనాధారం. ఆమె చిన్నవయసులోనే తల్లి సుదీనమ్మ చనిపోగా, ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు తండ్రి సీతయ్య మృతిచెందాడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2024 వరకు 5 కిలోలు బియ్యం ఇచ్చేవారు. వేలి ముద్ర పడకపోయినా వలంటీర్, వీఆర్వో అథెంటికేషన్‌తో బియ్యం, పింఛన్ అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆమె రేషన్ కార్డును రద్దుచేశారు. పింఛన్‌ను తొలగించారు. ఫలితం ఆమె బతుకు దుర్భరంగా మారింది. అధికారులు స్పందించి రద్దుచేసిన రేషన్‌కార్డు, పింఛన్‌ను పునరుద్ధరించాలని చేతులు జోడించి వేడుకుంటోంది. ఇదే విషయాన్ని వీఆర్వో గోపాలనాయుడు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా వేలిముద్రలు పడకపోవడం వల్ల బియ్యం ఆపేశారని, రేషన్ కార్డు పునరుద్ధరిస్తూ తన అంథెంటికేషన్‌తో బియ్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఒంటరి మహిళగా ధ్రువీకరిస్తూ పింఛను మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– రామభద్రపురం



ఆదుకోవాలని అభ్యర్థిస్తున్న గిరిజన మహిళ గంగమ్మ

వితరణ

వంగర: మండలంలోని నీలయ్యవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రేగిడి మండలం, కందిశ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంబళ్ల లవణం.. రూ.5 వేల విలువైన విద్యాసామగ్రి వితరణ చేశారు. వీటిని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జయరాజు చేతులమీదుగా విద్యార్థులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ పాఠశాల యాజమాన్యం రూ.10 వేలను ఆర్థికసాయంగా అందజేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బాడంగి: మండల కేంద్రంలోని కోదండరామ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ కన్నులపండువగా జరిగే స్వామి కల్యాణం తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. మంగళవారం శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

పరికరాలు అందిస్తాం

బొబ్బిలి: మున్సిపాలిటీలోని తడి, పొడి చెత్త సేకరణ, రీసైక్లింగ్‌లకు అవసరమైన ఆగ్రోస్ పరికరాలు, వాహనాలు, వాటి విడిభాగాలు సరఫరా చేస్తామని ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్ పి.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. స్థానిక ఆగ్రోస్ సిబ్బందితో కలిసి మున్సిపల్ మేనేజర్‌ను సోమవారం కలిసిన ఆయన.. గతంలో కాంపాక్టర్స్ తదితర వాహనాలను అందించామని, ఇప్పుడు కూడా ఇండెంట్లు అందజేసి, మున్సిపల్ కమిషనర్ నిర్ణయాన్ని తెలియజేయాలని ఆయన కోరారు. రూ.2 కోట్ల మేర లక్ష్యాలు సాధించే దిశగా మున్సిపాలిటీ కమిషనర్లను కలుస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు సత్య కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో హెటిరో ల్యాబ్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మంగళవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్షన్ విభాగం పోస్టులకు బీఎస్సీ అన్ని గ్రూప్‌ల విద్యార్థులు, బీకాం, బీఏ పాసైన, ప్రస్తుతం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. క్యూసీ, క్యూ ఏ విభాగం పోస్టులకు ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ వారు అర్హులని తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రికల విభాగంలో ఐటీఐ (2021 నుంచి 2024 మధ్యలో పూర్తి చేసిన) విద్యార్థులు అర్హులన్నారు. ఉదయం 9 గంటలకు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పేర్ల నమోదుకు 70123 93316, 90327 72661 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు గాయత్రి డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ కె.నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అరబిందో, న్యూ ల్యాండ్, గ్రాన్యూల్స్ ఫార్మాకు చెందిన కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు.

చెరువు ఆక్రమణలు అడ్డుకోండి

తెర్లాం మండలం, పెరుమాళి గ్రామ ఎర్ర చెరువు ఆక్రమణకు గురవుతోందని, అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో జరిగిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'కు వారంతా వెళ్లి, చెరువు ఆక్రమణలపై తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు చెరువు గర్భాన్ని కప్పేసి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. స్పందించిన తహసీల్దారు.. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆర్ఐ కృష్ణమూర్తిని ఆదేశించారు. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

– తెర్లాం



వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన వీఆర్‌ఏలతో కలిసి రామభద్రపురం మండల కేంద్రంలో డీటీ గిరిధర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ వ్యవస్థలో కింది స్థాయి ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో వీఆర్‌ఏలు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వడంతో పాటు డీఏ కూడా ఇవ్వాలని కోరారు. అలాగే నైట్ డ్యూటీలు రద్దు చేసి, పదోన్నతులు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీర్‌ఏల సంఘం నాయకులు మారయ్య, రాజారావు, లక్ష్మి పాల్గొన్నారు.

–రామభద్రపురం



పొలాలకు దారి చూపాలని వినతి

రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్‌ను ఆనుకుని ఉన్న పొలాలకు దారి(రోడ్డు సదుపాయం కల్పించాలని) చూపాలని మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'కు హాజరై, తహసీల్దారు ఎ.సులోచనరాణికి వినతిపత్రం అందజేశారు. తమ పూర్వీకుల దగ్గర నుంచి సాగు చేస్తున్న పొలాలకు దారి లేకుండా పంచాయతీ అధికారులు చేశారని తెలిపారు. అక్కడి జిరాయితీ భూమిని ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. తక్షణమే సర్వే చేసి హద్దులు గుర్తించాలని, పొలాలకు రోడ్డు వేయాలని వినతించారు. కార్యక్రమంలో ఎం.అప్పలనాయుడు, వి.సూర్యనారాయణ, ఎం.రవికుమార్, వి.తిరుపతిరావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

–రామభద్రపురం

